క్లుప్తంగా

ఘనంగా బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం


బంగారమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వేపాడ: మండలంలోని చామలాపల్లి పంచాయతీ పోతుబందిపాలెంలో బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ముర్రాటలు, చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి


వల్లాపురంలో డయేరియా కేసులపై ఆరా తీస్తున్న డీపీఓ మల్లికార్జునరావు

గుర్ల: గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని డీపీఓ డీవీ మల్లికార్జునరావు ఆదేశించారు. మండలంలో డయేరియా కేసుల నమోదు శీర్షికన సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డయేరియా ప్రబలిన చింతలపేట, వల్లాపురం గ్రామాల్లో ఆయన పర్యటించి పరిస్థితి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని కార్యదర్శులను ఆదేశించారు. డయేరియా ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పర్యటనలో ఎంపీడీఓ శేషుబాబు, ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణదేవి, తదితరులున్నారు.

విత్తన దుకాణాల పరిశీలన


పెదమానాపురం సంత వద్ద విత్తనాల షాపులో వరి విత్తనాలు పరిశీలిస్తున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: మండలంలోని చినకాద, మరడాం, పెదమానాపురంలలో వరి విత్తనాలు అమ్ముతున్న షాపులను ఏఓ అనురాధ శుక్రవారం తనిఖీ చేశారు. వరి విత్తనాల నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్స్ సేకరించి విశాఖపట్నం ల్యాబ్‌కు పంపిస్తామని ఏఓ తెలిపారు. వ్యాపారులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, లేనిపక్షంలో లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


గొభ్యాంలో తాగునీటి ట్యాంక్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

దత్తిరాజేరు: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పెదకాద, గోభ్యాం గ్రామాలలో శుక్రవారం పర్యటించి మురుగు కాలువలు, తాగునీటి ట్యాంక్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శులను సూచించారు.

ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకండి

- ఎంపీడీఓ కల్యాణి


చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బి.కల్యాణి

గజపతినగరం: ఇంటి పరిసర ప్రాంతాల సమీపంలో చెత్తలు వేసి రోగాల బారిన పడవద్దని ఎంపీడీఓ బి.కల్యాణి సూచించారు. గజపతినగరం మండల కేంద్రంలోని పలు వీధుల్లో శుక్రవారం ఆమె పర్యటించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ పారబోయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ జనార్దనరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పేరుకే ఏరియా ఆస్పత్రి..
సౌకర్యాలు మాత్రం శూన్యం


రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రి

- కంపుగొడుతున్న మరుగుదొడ్లు
- లేబరేటరీ వద్ద తప్పని నిరీక్షణ
- కూర్చోవడానికి కుర్చీలు కరువు
- తాగడానికి నీరు లేదు
- రోగులకు తప్పని ఇబ్బందులు


ల్యాబ్ వద్ద గుమికూడిన రోగులు


గైనిక్ విభాగం వద్ద వేచి ఉన్న మహిళలు

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. చికిత్స మాట పక్కనబెడితే కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సౌకర్యం కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో బయట దుకాణాల్లో వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జ్వరాలు, జలుబుతో బాధపడుతూ రోజుకు సుమారు 400 మంది వస్తున్నారు. మెంటాడ, గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు మండలాలకు చెందిన రోగులు ఎక్కువగా వస్తుంటారు. అయితే కనీస వసతులు లేకపోవడంతో వీరంతా ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయంలో మరుగుదొడ్డికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లకు నిర్వహణ లేకపోవడంతో కంపుగొడుతున్నాయి. దీంతో అత్యవసర సమయంలో మహిళా రోగులు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం.

సౌకర్యాల కల్పనపై దృష్టి సారిస్తాం..

ఆస్పత్రికి వచ్చే రోగులకు సౌకర్యాలు కల్పించే విషయమై దృష్టి సారిస్తాం. తాగునీరు, కుర్చీల సౌకర్యం కల్పించడంతో పాటు మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహిస్తాం. నూతన భవనం నిర్మాణంలో ఉంది. అందులోకి మారితే ఇరుకు సమస్య ఉండదు. ఆస్పత్రిలో 19 మంది వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఓపీ నిర్వహిస్తున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.
– జగదీష్, ఆస్పత్రి సూపరింటిండెంట్

ఆస్పత్రిలో 19 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నా కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.

తోపులాటలు..

రక్త పరీక్షలు నిర్వహించే లేబరేటరీ ఇరుకుగా ఉండడంతో నిత్యం తోపులాటలు జరుగుతున్నాయి రోగులు చెబుతున్నారు. ఒక పక్క మందుల బాక్సులతో ఆస్పత్రి నిండిపోగా.. మరోపక్క ఇరుకుగా ఉన్న గదులతో రోగులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. అలాగే మందులు ఇచ్చే గది వద్ద కూడా ఇరుకుగా ఉండడంతో రోగులు చాలాసేపు వేచి ఉండాల్సి వస్తోంది.

భూములు ఇవ్వం..

- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్


భూములు ఇచ్చేది లేదని చెబుతున్న రైతు సంఘం నేత జగన్

శృంగవరపుకోట: యాభై లక్షల రూపాయల విలువ చేసే ఎకరా భూమికి రూ.12,50,000 ఇచ్చి చేతులు దులిపేసుకోవాలని చూస్తూ కాలవలకు భూములిచ్చేది లేదని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పోరాట కమిటీ కన్వినర్ చల్లా జగన్ పలువురు రైతులతో కలిసి అధికారులకు స్పష్టంచేశారు. మండలంలోని వీరనారాయణం సచివాలయంలో డిప్యూటీ కలెక్టర్ ఎంఎస్ కళావతి, ఇతర రెవెన్యూ అధికారులతో కలిసి వచ్చి రైతులతో భూసేకరణపై శుక్రవారం అభిప్రాయసేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్‌లో ఎకరా భూమి విలువ రూ.50 నుంచి 70 లక్షల వరకు ఉంటే మీరు రూ.12.5 లక్షలు ఇస్తామంటే భూములు ఎందుకిస్తారని ప్రశ్నించారు. దీంతో రైతులు స్వరం కలిపి అధికారులు చెప్పిన ధరకు భూములు వదులుకునేది లేదని స్పష్టం చేశారు. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం సొమ్ము ఇవ్వండి.. లేదంటే భూమికి తగ్గ భూమి ఇవ్వాలని చెప్పి సమావేశం నుంచి వెళ్లిపోయారు. మూడేళ్ల కిందట గ్రామసభలు నిర్వహించారు.. నాడు చేసిన తీర్మానాలు ఏమయ్యాయని జగన్ ప్రశ్నించారు. 2013 ల్యాండ్ ఎక్విజిషన్ యాక్ట్ ప్రకారం ధర నిర్ణయించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో గ్రామ పెద్దలు ఎం.సత్యనారాయణ, పురుషోత్తంనాయుడు, ఎం.సోంబాబు, ఎం.రవి, బీల చిన్నమ్మలు, ఎం.వెంకటరావు, అవగడ్డ తమ్మునాయుడు, చల్లా చంద్రరావు, రావాడ గోవిందరావు, జె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు


ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో గల జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సంగతి తెలిసిందే. ఈమేరకు విద్యార్థినులను స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన స్వగృహంలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాల చరిత్రలో ఒకే ఏడాదిలో పది మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం ఇదే మొదటి సారన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసిన పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌ను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

సులభతర పద్ధతిలో బోధన


ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్, తదితరులు

గజపతినగరం రూరల్: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేపట్టాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ఎస్.ప్రసాదరావు అన్నారు. మండలంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పరిశీలనలో సీఎంఓ వి.ఆదినారాయణ, ఎంఈఓలు విమల, చక్రధర్ పాల్గొన్నారు

చెత్త సేకరణపై ఆరా


తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శిరీష

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ శృంగవరపుకోటలో డీఎల్‌పీఓ శిరీష శుక్రవారం పర్యటించి చెత్త సేకరణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఈఓపీఆర్‌డీ లక్ష్మి, పంచాయతీ ఈఓ అనురాధలతో కలిసి పట్టణంలోని కొన్ని వీధుల్లో పర్యటించారు. తడి - పొడి చెత్త సేకరణ ఎలా చేస్తున్నారు.. చెత్తను ఎలా నిల్వ చేస్తున్నారు, తదితర విషయాలపై స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణకు సిబ్బంది వస్తున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఈఓపీఆర్‌డీ, పంచాయతీ ఈఓలను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర


లక్కవరపుకోట: పురవీధుల్లో రథయాత్ర


జామిలో జరుగుతున్న జగన్నాథస్వామి రథయాత్ర

జామి: మండల కేంద్రంలో జగన్నాథుడి రథయాత్ర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనాథ సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రథయాత్ర చేపట్టారు. అలాగే అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న జగన్నాథస్వామికి పూజలు చేసి రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా లక్షతులసి పూజ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల సీతారాస్వామి ఆలయం వద్ద నుంచి జగన్నాథస్వామి రథయాత్ర చేపట్టారు. పురోహితుడు ఎ.శ్రీహరిశర్మ మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో రథంలో ఊరేగించారు.

దళిత ఉద్యమ కెరటం బొజ్జా తారకం..


బొజ్జా తారకం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘ నేతలు, తదితరులు

శృంగవరపుకోట: ప్రముఖ న్యాయవాది బొజ్జా తారకం దళిత ఉద్యమ కెరటమని ప్రజాకవి ఆతయ ఉదయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో పౌరహక్కుల ఉద్యమకారుడు, దళిత మహాసభ నేత బొజ్జా తారకం 86వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తారకం రచించిన నది పుట్టిన గొంతుక..పోలీసులు అరెస్టు చేస్తే ఏం చేయాలి.. బ్రెజిల్ భూపోరాటం.. పంచతంత్రం.. ఇది రిజర్వేషన్ల దేశం, తదితర పుస్తకాలు ప్రజలను ఆలోచింపజేశాయన్నారు. కారంచేడు, చుండూరు, లక్ష్మింపేట మారణకాండలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కేఎల్ రామకోటి, పి.సూరిదేముడు, బోనెల ఈశ్వరరావు, మొయ్యి వెంకటరమణ, ఎద్దు కృష్ణ, కోడి రవి, తదితరులు పాల్గొన్నారు.

అతివల అవస్థలు..



మేజర్ పంచాయతీ ధర్మవరంలో మారుతీనగర్‌లో ఉన్న వీధి కుళాయి పైపు విరిగిపోవడంతో చివరన ఉన్న నాలుగు కుళాయిలకు తాగునీరు అందడం లేదు. పదిహేను రోజులుగా తాగునీటికి కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. దీంతో కుళాయి పైపు కింద గొయ్యి తవ్వుకుని అందులో ఒక పాత్ర ఉంచి దానిలోకి చేరిన నీటిని బిందెల్లోకి తోడుకుంటున్నారు. ఓట్లు దండుకున్న వేళ మాటలు చెప్పిన పెద్దలకు మా పాట్లు కనిపించడం లేదా అని మారుతీనగర్ మహిళలు మండిపడుతున్నారు. – శంగవరపుకోట

చేయి చేయి కలిపారు..


నాడు: అభివృద్ధి చేయక ముందు పాఠశాల భవనం


నేడు : ఆకర్షణీయంగా మారిన భవనం

కార్పొరేట్ విద్యపై ప్రతి ఒక్కరూ ఆసక్తి కనబరుస్తున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలోనే గ్రామానికి చెందిన చిన్నారులు చదువుకోవాలనే ఉద్దేశంతో గజపతినగరం మండలంలోని బూడిపేట గ్రామానికి చెందిన యువత ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసింది. శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది ఆకర్షణీయమైన రంగులు వేశారు. ఫ్లోరింగ్, టైల్స్ వేయడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించారు. దీంతో గ్రామపెద్దలు యువతను అభినందించారు. – గజపతినగరం రూరల్

అధ్వాన రహదారి..



చీపురుపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గతంలోనే బీటీ రోడ్లు ఉన్నప్పటికీ నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా పాడయ్యాయి. అందులో భాగంగానే మండలంలోని రావివలస గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కూడా అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు మీదుగా రావివలస, గురానపేట, ఆర్తివలస, పైలపేట, కొత్తపేట, తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మొత్తం పాడవ్వడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – చీపురుపల్లి

కృతజ్ఞతలు..



గంట్యాడ మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన జాగరపు చినసత్యారావు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన విజయనగరంలోని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, లచ్చిరెడ్డి కృష్ణ పాల్గొన్నారు. – గంట్యాడ

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల నిరసన


ఆందోళన చేస్తున్న రేగపుణ్యగిరి గ్రామ గిరిజనులు

శృంగవరపుకోట: అడవుల్లో ఉన్నారు.. అక్షర జ్ఞానం లేనోళ్లు.. ఏం చెప్పినా, ఏం చేసినా అడిగేవారు లేరన్న ధైర్యంతోనే అధికారులు, నాయకులు మా జీవితాలతో ఆటలాడుతున్నారంటూ రేగపుణ్యగిరి గిరిజనులు ధ్వజమెత్తారు. ఈ మేరకు గ్రామస్తులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రేగ పుణ్యగిరికి రోడ్డు వేయాలి.. ఇచ్చిన హామీలు నెరవేర్చాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ.. ధారపర్తి పంచాయతీలో ప్రసవం కోసం ఒక మహిళను 20 కిలోమీటర్లు డోలీలో మోసుకొచ్చారని చెప్పారు. 2014లో శ్రమదానంతో పుణ్యగిరి గ్రామానికి రోడ్డు వేస్తుండగా.. కొంతమంది అడ్డగించడంతో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికీ కొండమీద 47 ఇళ్లు ఉన్నాయి.. మాకు ఏదైనా రోగం వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆరు నెలల కిందట కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామానికి వచ్చి ఉగాది నాటికి రోడ్డు, తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాని ఇంతవరకు హామీ నెరవేరలేదు. సీపీఎం నాయకులు గాడి అప్పారావు, సీహెచ్ ముత్యాలు మాట్లాడుతూ.. అధికారులే ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఎలా ప్రశ్నించారు. రోడ్డు వేయకుండా పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. అనంతరం హెచ్‌డీటీకి వినతిపత్రం అందజేశారు.

నెరవేరని కలెక్టర్ హామీ..

2025 జనవరి 17న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పుణ్యగిరిలో సమావేశం నిర్వహించారు. రేగ పుణ్యగిరి గ్రామానికి రోడ్డు, తాగునీరు సదుపాయం కల్పించేందుకు రూ. 2 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. కాని ఇంతవరకు ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడంతో కలెక్టర్ హామీ కూడా నెరవేరలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


పాటూరు సచివాలయంలో సిబ్బంది సూచనలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: గ్రామ సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని పాటూరు, శింగరాయి, సోంపురం సచివాలయాలను శుక్రవారం ఆయన సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడంతో పాటు ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయాలన్నారు. గ్రామంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా అంబాసిడర్లకు రూట్ మ్యాప్ ఇవ్వాలని సూచించారు. సోంపురం రైతు సేవా కేంద్రం, సచివాలయ పరిధిలో శానిటేషన్ చేయాలని గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రవికుమార్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి..

- ఉపాధి ఏపీఓ కృష్ణవేణి


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి హామీ ఏపీఓ కృష్ణవేణి

గజపతినగరం: వ్యవసాయరంగ పంటలతో పాటు పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి ఏపీఓ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఉద్యానవన పంటలైన అరటి, మామిడి తదితర పంటలు సాగుకు రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. ఈ తోటల్లో మొక్కజొన్న, గోధుమ వంటి అంతర పంటలు కూడా సాగు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ జేఈ అప్పారావుతో పాటు తుమ్మికాపల్లి సర్పంచ్ బి.త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.